
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8 : కనిష్ఠం 20.2
5
కామారెడ్డి
జిల్లా వార్తలు
సోమవారం 26 ఫిబ్రవరి 2024




జిల్లా కేంద్రంలో ఘనంగా మహా పడిపూజ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 25: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవుని పల్లిలో శ్రీమల్లికార్జున సిండికేట్ ఆధ్వర్యంలో ఆదివారం మహాపడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శివునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. దాదాపు 120మంది శివమాలధార స్వాములు పడిపూజలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వికాస్, నారాయణరావు, లక్ష్మీపతి యాదవ్, నరేష్, వెంకటి, అంజయ్య, కౌన్సిలర్‌లు గోదావరి, పోలీస్ కృష్ణాజీరావు తదితరులు పాల్గొన్నారు.



చిట్ ఫండ్



- జిల్లాలో వడ్డీ వ్యాపారులపై పోలీసుల దాడులు
- వందల సంఖ్యలో బాధితులు.. ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న కంపెనీలు
- డబ్బులు కట్టించే వరకే కనిపిస్తున్న ఏజెంట్లు
- నెలల తరబడి చెల్లింపులకు తప్పని ఎదురుచూపులు
- బాధితులకు అంతంత మాత్రంగానే అందుతున్న న్యాయం

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 25: జిల్లాలో అధిక వడ్డీ వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై పోలీసులు దాడులు చేస్తూ నివారణకు చర్యలు చేపడుతున్నారు. అధిక వడ్డీ వసూలు చేస్తూ అది కట్టక పోతే నివాసం ఉండే ఇంట్లోనే వంట చేసుకోవడం అక్కడే నివాసం ఉండి డబ్బులు కట్టే వరకు కదిలేది లేదంటూ భీష్మించుకుని కూర్చుంటున్నారు. జిల్లా కేంద్రంలో ఈ తరహా దందా పెద్దఎత్తునే సాగుతుండో ఇటీవల ఓ వ్యక్తి అప్పుతీసుకుని అనారోగ్యం కారణంగా చెల్లింపులు జరపడంలో ఆలస్యం కావడంతో ఆయన కుటుంబంలోని వ్యక్తిని తీసుకెళ్లారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ ఈ విషయంపై సీరియస్ అయి అధిక వడ్డీలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహించడంతో పాటు అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారు ఎక్కడికక్కడ సైలెన్స్ అయిపోయారు. అయితే ఇదే తరహాలో చిట్‌ఫండ్ కంపెనీల పేరుతో ఇబ్బడిముబ్బడిగా నెలకొల్పుతూ ప్రజల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న పలు కంపెనీలపై సైతం దృష్టి సారించాలని వాదనలు వినిపిస్తున్నాయి.

ఏజెంట్లతో అమాయకులకు గాలం

నెలవారీ చిట్టీల పేరుతో పల్లె, పట్టణాల్లోని ప్రజలకు ఏజెంట్ల ద్వారా అమాయకులకు గాలం వేస్తున్నారు. ఆయా చిట్‌ఫండ్ కంపెనీల్లో డబ్బులు కట్టించే వరకే ఏజెంట్లు కనిపిస్తుండగా చిట్టి లేపిన తర్వాత మాత్రం ఇప్పించేందుకు రాకపోవడంతో ఏమిచేయాలో తెలియక కొందరు సదరు కంపెనీలపై దాడులు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మరికొందరు ఏజెంట్లు తమను నమ్మి డబ్బులు కట్టారని ఎంతో కొంత మానవత్వం చూపిస్తున్నారని కార్యాలయానికి వస్తే సదరు కంపెనీ నిర్వాహకులు కనిపించకుండా దాగుడు మూతలు ఆడుతున్నారని తెలుస్తోంది. ఒకవేళ అదే కంపెనీలో చిట్టీ ఎత్తి డబ్బులను ఒక నెల ఆలస్యం కడితే ఇదే ఏజెంట్లు పదుల సంఖ్యలో వారి ఇంటికి వెళ్లి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. మరీ వారు ఇతరులతో కట్టించిన డబ్బులను ఇప్పించమంటే మాత్రం అది కంపెనీ వారికి అడగడంటూ దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు. చాలా చోట్ల పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదులు చేసిన సదరు చిట్‌ఫండ్ కంపెనీలపై పూర్తిస్థాయిలో చర్యలు కరువయ్యాయి. చిట్‌ఫండ్‌ల మోసాలను నియంత్రించాల్సిన సంబంధిత శాఖ అధికారులు సైతం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న కంపెనీలు

కామారెడ్డి జిల్లా కేంద్రంలో చిట్‌ఫండ్ కంపెనీల లీలలు బట్టబయలు అవుతున్న చర్యలు మాత్రం కనిపించిన దాఖలాలు లేవు. వ్యాపార, వాణిజ్యపరంగా అన్ని రకాలుగా జిల్లా కేంద్రం అభివృద్ధి చెందుతుండడంతో పుట్టగొడుగుల చిట్‌ఫండ్ కంపెనీలను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త బస్టాండ్ నుంచి హౌజింగ్‌బోర్డు కాలనీ వరకు, సిరిసిల్లా రోడ్, నిజాంసాగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన కొన్ని చిట్‌ఫండ్ కంపెనీలపై డబ్బులు కట్టించుకొని మోసగిస్తున్నారని ఫిర్యాదులు కోకొల్లలుగా వస్తున్నాయి. కొందరు లోలోపల సర్దుబాటు చేసుకుంటుండగా మరికొందరు దౌర్జన్యాలు చేయడం, మధ్యవర్తులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలుస్తోంది. పదులసంఖ్యలోనే ఆయా చిట్‌ఫండ్‌లపై ఫిర్యాదులు వచ్చిన వాటిపై చర్యలు మాత్రం కరువయ్యాయని దీంతో ఒకరిని చూసి మరొకరు ప్రజలను మోసగిస్తున్నారని సమాచారం. గతంలో 200 మందితో చిట్టీలు వేయించిన ఓ ఏజెంట్ చిట్టీలు లేపిన తర్వాత కూడా డబ్బులు చెల్లించకపోవడం, రేపుమాపు అంటూ చిట్టీ కట్టిన వారిని తిప్పించుకోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి కంపెనీలోని ఫర్నిచర్ అంతా ధ్వంసం చేసిన సందర్భాలు ఉన్నాయి. సంవత్సరంలో ఇద్దరు చొప్పున మేనేజర్‌లను మారుతుండడంతో గతంలో పని చేసిన వారికి మాకు ఎలాంటి సంబంధాలు లేవని తేల్చి చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. ఓ చిట్‌ఫండ్ కంపెనీ నిర్వాహకులు చిట్టీలు వేసిన వారికి డబ్బులు ఇచ్చే సమయానికి ఇవ్వకుండా నెలల తరబడి తిప్పించుకోవడంతో కార్యాలయంలో బాధితులు గొడవకు దిగడంతో కార్యాలయాన్ని మూతపెట్టి ఫోన్లను స్విచ్చాఫ్ చేసుకుని ఆ తర్వాత కంపెనీ జాడలు లేకుండా పారిపోయిన ఘటనలు ఉన్నాయి. ఇలా చాలా చోట్ల చిట్‌ఫండ్ కంపెనీలలో ఇదే తరహా ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నా రని ఫిర్యాదులు అందినా చర్యలు కరువయ్యాయి.

అడుగడుగునా నిబంధనల పాతర

చిట్‌ఫండ్ కంపెనీ యాక్ట్ ప్రకారం కొత్తగా ఏర్పాటు చేసే చిట్‌గ్రూపులకు సంబంధించిన వివరాలన్నింటినీ జిల్లా రిజిస్ట్రార్‌కు సమర్పించాల్సి ఉంటుంది. మొత్తం ఎన్ని గ్రూపులు నిర్వహిస్తున్నారనే అంశంతో పాటు ఆ గ్రూపులో చేరిన సభ్యులు, చెల్లింపుల వ్యవహారాలు లాంటి అన్ని అంశాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. అలాగే ప్రతీ గ్రూపునకు సంబంధించిన సమాచారాన్ని సదరు రిజిస్ట్రార్‌కు అందుబాటులో ఉంచాలి. ప్రైవేట్ సైన్యంతో బకాయిలు వసూళ్లు చేపట్టరాదు. బకాయిలు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప వేధింపులకు పాల్పడవద్దన్న నిబంధనలున్నాయి. ఇలాంటి నిబంధలన్నింటినీ తుంగలో తొక్కి ధనార్జనే ధ్యేయంగా పలు చిట్‌ఫండ్ కంపెనీలు వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నాయి. వీటన్నింటినీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చిట్‌ఫండ్ కంపెనీల మోసాలను అరికట్టాల్సిన సంబంధితశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్నారు. చిట్‌ఫండ్ రిజిస్టర్ కార్యాలయం నిజామాబాద్‌లో ఉండడం ఆ అధికారులు లోలోపల చిట్‌ఫండ్ కంపెనీల వారితో కుమ్మక్కై విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం, కొన్నింటికి అనుమతులు లేకున్నా పట్టించుకోకపోవడం లాంటివి చేస్తుండడంతో అమాయక ప్రజల నుంచి లక్షలు వసూలు చేస్తూ తమను నిలదీస్తే శాఖ అధికారులకు వారు కాజేసిన డబ్బులలోంచి కొన్ని ఇచ్చి మభ్యపెడుతున్నారని సమాచారం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వడ్డీ వ్యాపారులను ఎలాగైతే కట్టడి చేస్తున్నారో చిట్‌ఫండ్‌మోసాలపై దృష్టి సారిస్తేనే ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు తప్పనున్నాయి.





వడ్డీ వ్యాపారుల వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

కాంగ్రెస్‌లోకి వలసల జోరు



కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ సర్పంచులు (ఫైల్)

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 25: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలోకి వలసల జోరు మొదలైంది. 2018 ఎన్నికల్లో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రావడంతో గెలుపొందిన కొన్ని నెలల్లోనే సురేందర్ కాంగ్రెస్ పార్టీ నుంచి అభివృద్ధి పేరిట బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. అప్పటి నుంచి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు అందరినీ కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి భారీ చేరికలతో కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బతీసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఊహించని విధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి మదన్ మోహన్‌రావు భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ పై రివేంజ్ మొదలు పెట్టిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మండలాల వారీగా సర్పంచ్‌లను, ఎంపీటీసీలను నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఎన్నికలకు ముందు కొన్ని కారణాల వల్ల అసంతృప్తిగా ఉన్న ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి, లింగంపేట్ జడ్పీటీసీ శ్రీలత ఎన్నికల సమయంలో మదన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చూకూరింది. దీనికి తోడు గత కొన్ని సంవత్సరాల నుంచి మదన్ మోహన్‌రావు చేపడుతున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి పార్టీ ఆదరణ మొదలైంది. కరోనా సమయంలో ఆక్సీజన్ కన్సన్ట్రేటర్, ఉచిత అంబులెన్స్ సర్వీస్, ఉచిత కంటి పరీక్షలు, అద్దాల పంపిణీ, ఆర్థిక సహాయాలు, నిరుద్యోగులకు జాబ్‌మేళా వంటి సేవా కార్యక్రమాల వల్ల ప్రజల్లో ఆదరణ మొదలైంది.

ఎప్పటికీ కొంత మంది బీఆర్ ఎస్ ముఖ్య నాయకులు మదన్‌మోహన్‌రావుకు టచ్‌లో ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల రాజేశ్వరి సాయిలు, రేపల్లెవాడ సాయిరాం, బ్రాహ్మణపల్లి లక్ష్మీ బాలయ్య, మల్లయ్యపల్లి ఎల్లయ్య దాల్, మల్కపల్లి రవీందర్, సబ్దాల్పూర్ నారాయణ, అల్మాజీపూర్ మాధవి, దత్తు, వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు శుక్రవారం పార్టీలో చేరారు. అదే విధంగా బీఆర్ఎస్ నాయకులు గండిపేట్ గ్రామ మాజీ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్, చిన్నాపూర్ ఏఎంసీ మాజీ చైర్మన్ కాంతారెడ్డి, మేడిపల్లి గ్రామ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు షాబుద్దీన్, గత నాలుగు రోజుల క్రితం ఎల్లారెడ్డి మండలంలోని మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే విధంగా నాగిరెడ్డిపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, మైపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్కారెడ్డి, సంజీవరెడ్డి మదన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లోకి చేరేందుకు సిద్ధంగా ఉన్న కౌన్సిలర్లు

ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 12 వార్డులు, 11 మంది కౌన్సిలర్లు ప్రస్తుతం బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడానికి సిద్ధమవుతున్న కౌన్సిలర్లు అవిశ్వాసాన్ని నెగ్గాల ంటే ఎమ్మెల్యే మద్దతు తప్పనిసరి అని ఇప్పటికే కొంత మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యేకు టచ్‌లో ఉన్నట్లు సమాచారం. త్వరలో సగానికి పైగా కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలోకి వెళతున్నట్లు సమాచారం.

భిక్కనూరులో కొనసాగుతున్న ఎల్లమ్మ జాతర

- ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ఊరేగింపు



జాతరలో పాల్గొన్న గ్రామస్థులు

భిక్కనూరు, ఫిబ్రవరి 25: భిక్కనూరు మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ జాతర కొనసాగుతుంది. రెండవ రోజు ఉదయం అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన, సాయంత్రం ఆలయం చుట్టూ డప్పుచప్పుళ్ల నడుమ ఎడ్లబండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎడ్లబండ్ల ఊరేగింపు సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గౌడసంఘం ప్రతినిధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం ప్రతినిధులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగతనాలకు.. సీఈఐఆర్ పోర్టల్‌తో చెక్

- ఫిర్యాదు చేస్తే చాలు సీఈఐఆర్‌తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల రికవరీ
- సెల్‌ఫోన్ల రికవరీలో జిల్లాదే మొదటి స్థానం

భిక్కనూరు, ఫిబ్రవరి 25: నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు ప్రస్తుత రోజుల్లో సెల్‌ఫోన్ లేకుండా కొన్ని క్షణాలు కూడా ఉండలేకపోతాం. సెల్‌ఫోన్ అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో అంత ముఖ్యంగా మారింది. ప్రస్తుత రోజుల్లో విద్య, వ్యాపారం, ఆరోగ్యం, బ్యాంకింగ్, రాజకీయం ఇలా ప్రతీ దానికి సెల్‌ఫోనే మూలాధారమైంది. కరోనా అనంతరం ఈ స్మార్ట్‌ఫోన్ల వినియోగం చాలా పెరిగింది. దీంతో చాలా మంది వ్యక్తిగత, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ విషయాలను సెల్‌ఫోన్లలోనే సాఫ్ట్‌కాపీల రూపంలో భద్రపరుచుకుంటున్నారు. అంతటి కీలకమైన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా చాలా ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటుగా పోగొట్టుకున్నా.. దొంగిలించబడిన సెల్‌ఫోన్ దొరుకుతుందా లేదా అనే భయాందోళనకు గురయ్యే పరిస్థితి ఉంటుంది. గతంలో సెల్‌ఫోన్ పోతే పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే దొరుకుతుందన్న నమ్మకం ఉండేది కాదు, కొందరైతే దానిపై ఆశలు వదులుకుని ఫిర్యాదు చేసేవారు కాదు. కానీ ఇప్పుడు అలా కాదు, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చాలు పోగొట్టుకున్న ఫోన్‌ను అతి తక్కువ సమయంలో పోలీసులు అందజేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి పోలీసుశాఖ వినూత్న సాంకేతికత సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్)ను అందుబాటులోకి తీసుకోచ్చింది. దీంతో పోలీసులు సెల్‌ఫోన్ దొంగల భరతం పట్టడంతో పాటుగా బాధితులకు దొంగిలించబడిన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను తిరిగి అందించగలుగుతున్నారు.

సెల్‌ఫోన్ పోతే వెంటనే ఇలా చేయాలి

సెల్‌ఫోన్ దొంగిలించబడినా.. ఏదైనా ప్రాంతంలో పోగొట్టుకున్న వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆ పోగొట్టుకున్న, చోరీకి గురైనా ఫోన్‌కు సంబంధించిన ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ కోడ్ (ఐఎంఈఐ) 15 అంకెలతో కూడిన నెంబర్‌తో పాటుగా, అందులో ఉన్న సెల్‌ఫోన్ నెంబర్‌తో ఫిర్యాదు చేయాలి. దీంతో వెంటనే పోలీసు సిబ్బంది ఫిర్యాదుదారుడి ఫోన్ ఐఎంఈఐ నెంబర్, ఫోన్ నెంబర్‌తో పాటుగా పూర్తి వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. అనంతరం పోలీసులు సూచించిన వెంటనే మరల అదే నెంబర్‌పై కొత్త సిమ్ తీసుకోవాలి.

ఇది ఈ పోర్టల్ పని విధానం

పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా సెల్‌ఫోన్ వివరాలను పోలీసులు సీఈఐఆర్‌లో నమోదు చేయగానే ఆ సెల్‌ఫోన్‌లోని ఫోన్‌నెంబర్ బ్లాక్ అయి ఆటోమెటిక్‌గా ఫోన్ మాత్రమే పని చేస్తోంది. ఈ విషయం తెలియని సెల్‌ఫోన్ దొంగిలించిన వారు, సెల్‌ఫోన్ దొరికిన వారు ఆ సెల్‌ఫోన్‌లో వేరే సిమ్ వేసి వినియోగించడానికి ప్రయత్నాలు చేస్తారు. కానీ అప్పటికే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు ఉండటంతో ఆ ఫోన్ పని చేయకపోవడంతో పాటుగా పోలీసులకు,



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న దృశ్యం

బాధితుడికి సెల్‌ఫోన్‌లో ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్ కొత్త నెంబరు, లొకేషన్ మెసేజ్ వస్తోంది. వెంటనే పోలీసులు వచ్చిన నెంబర్‌కు ఫోన్ చేసి వెంటనే ఆ సెల్‌ఫోన్‌ను పోలీసుస్టేషన్‌లో అందజేయాలని లేనియెడల కేసులు నమోదయ్యే అవకాశం ఉంటుందని చెప్పడంతో ఆ సెల్‌ఫోన్‌ను వాడుతున్న వారు తప్పని పరిస్థితుల్లో పోలీసుస్టేషన్‌లో అప్పగించే పరిస్థితి ఉంది.

ఈ ఫోన్ల రికవరీలో కామారెడ్డి జిల్లానే మొదటి స్థానం

దొంగలించబడిన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తిరిగి ఈ పోర్టల్ ద్వారా రికవరీ చేయడంతో దేశంలోనే దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. తెలంగాణ రాష్ట్రంలో చూస్తే కామారెడ్డి జిల్లా మెదటిస్థానంలో కొనసాగుతోంది. ఇప్పటి వరకు కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి సబ్ డివిజన్ల పరిధిలో 1053 సెల్‌ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. ఇందులో అధికంగా బాన్సువాడ సబ్ డివిజన్‌లో 442, కామారెడ్డి సబ్ డివిజన్‌లో 398, ఎల్లారెడ్డి సబ్ డివిజన్‌లో 213 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

సెల్‌ఫోన్ చోరీకి గురైతే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి

- సంపత్, సీఐ, భిక్కనూరు



సెల్‌ఫోన్ దొంగతనానికి గురైనా లేదంటే ఎక్కడైనా పోగొట్టుకున్న వెంటనే ఐఎంఈఐ, పూర్తి వివరాలతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో తిరిగి పొందే అవకాశం ఉంది. ఇప్పటి వరకు భిక్కనూరు సర్కిల్ పరిధిలోని భిక్కనూరు, రాజంపేట, దోమకొండ, బీబీపేట పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేసిన వారికి తిరిగి సెల్‌ఫోన్లను ఈ పోర్టల్ ద్వారా అందజేయడం జరిగింది. ఈ అవకాశాన్ని సర్కిల్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

బీఆర్ఎస్ నుంచి వర్ని ఎంపీపీ దంపతుల సస్పెన్షన్!

వర్ని, ఫిబ్రవరి 25: పార్టీ కార్యక్రమాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి, ఆమె భర్త వీర్రాజులను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వర్ని మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రకటించారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆదివారం వర్నిలో మండల పార్టీ అధ్యక్షుడు గిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే పోచారం దయా దాక్షిణ్యాలతో ఉన్న పదవులు అనుభవించి వారు పోచారం ఆయన తనయులు సేవలు మరిచిపోయి కాంగ్రెస్ పార్టీ వారితో కలవడం పట్ల ఎంపీపీ దంపతులు ఆత్మ విమర్శ చేసుకోవాలని వారు సూచించారు. ప్రజా నాయకులుగా దమ్ముంటే ఎంపీపీ పదవికి, పార్టీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ క్యాడర్‌ను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి గత ఎన్నికల్లో ఓటమి భయాన్ని తట్టుకోలేక బలవంతంగా కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నారని ఆరోపించారు.

సమావేశంలో జడ్పీటీసీ హరిదాస్, వైస్ ఎంపీపీ బాలరాజు, రైతు సమన్వయ అధ్యక్షులు సింగంపల్లి గంగారాం, ఏఎంసీ ఉపాధ్యక్షులు గోపాల్, నాయకులు సాయిబాబా, కనకారెడ్డి, శ్రీనగర్ రాజు, జానకి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూలో చేరుతున్న ఆటో కార్మికులు

కార్మికుల సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటం

- సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్
- రుద్రూరు ఆటో కార్మికులు సీఐటీయూలో చేరిక

రుద్రూరు, ఫిబ్రవరి 25: కార్మికుల సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పేర్కొన్నారు. ఆదివారం రుద్రూరు మండల కేంద్రంలో ఆటో కార్మికులు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, సీపీఎం సీనియర్ నాయకులు గంగాధరప్ప సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ... నిరంతరం కార్మికుల సమస్యలపై సీఐటీయూ పోరాటం చేస్తుందని, తద్వారా ఆటో కార్మికులు ఆకర్షితులై సీఐటీయూలో చేరారన్నారు. హిట్‌అండ్‌రన్ (బీఎన్ఎస్), 106 (1) (2) సెక్షన్ రద్దు చేయాలని, ఎం.వి. యాక్ట్ 2019 సవరణ చట్టం రాష్ట్రంలో అమలు చేయవద్దని, సవరణను ఉపసంహరించుకునే విధంగా కేంద్రం మీద ఒత్తిడి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కారించాలని లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. రఫీక్, జలీల్, వినోద్, సద్దాం లతీఫ్, శివ, సతీష్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- పాత వర్ని ఎక్స్ రోడ్డు వద్ద అదుపుతప్పిన బైక్

వర్ని, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఈర్నాల పంత్‌కుమార్ (61) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. నవీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి మోస్రా నుంచి బాన్సువాడ వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పాత వర్ని ఎక్స్ రోడ్డు వద్ద అదుపు తప్పి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.


డిచ్‌పల్లి- స్వచ్ఛ క్యాంపస్ నిర్వహిస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

ఏబీవీపీ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ క్యాంపస్'

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 25: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏబీవీపీ టీయూ ఆధ్వర్యంలో స్వచ్ఛ క్యాంపస్ కార్యక్రమాన్ని విద్యార్థులంతా సహర్షిగా శ్రమదానం చేశారు. కళాశాల ఎదుట పేరుకుపోయిన ప్లాస్టిక్ చెత్తా చెదారాన్ని తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కన్వీనర్ ప్రమోద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు హరినాత్‌రెడ్డి, శివ, నాగరాజు, సాయి, అమృత్‌చారి, పావని, అనిల్, తరుణ్, హరికృష్ణ, సచిన్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 25: డిచ్‌పల్లిలోని 30 పడకల ఆసుపత్రిని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ సందర్శించారు. రోగులకు అందు తున్న వైద్య సేవలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ఆసుపత్రిలో ఓపీ శాతాన్ని పెంచాలని, డెలివరీలు పెంపు చేయాలని, ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో మరింత విశ్వాసం పొందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సుశాంత్, ప్రకాశ్, హెల్త్ అసిస్టెంట్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 25: జిల్లాలో ఆదివారం నిర్వహించిన గురుకుల ప్రతిభాకళాశాల ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల సూపరింటెండెంట్ సంగీత తెలిపారు. ఉదయం 10 నుంచి 1గంట వరకు సీవోఈ సెట్ ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష జరిగిందన్నారు. 329 మంది అభ్యర్థులకు గాను 312 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని 17 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆమె తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను ఎల్లారెడ్డి ప్రిన్సిపల్ కృతామూర్తి, బోర్ల ప్రిన్సిపల్ పద్మకుమారిలు సందర్శించారు.

నేడు స్వర్ణఖడ్గ బహూకరణ

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25: నగరంలోని అయ్యప్ప మందిరంలో గల అయ్యప్పస్వామికి సోమవారం జగద్గురు శంకరాచార్య హంపీ విరుపాక్ష విద్యారన్య భారతీస్వామి చేతుల మీదుగా స్వర్ణఖడ్గ బహూకరణ నిర్వహించనున్నట్లు ఇందూరు అయ్యప్ప మందిరం అధ్యక్షుడు గడ్డం భక్త వత్సలం తెలిపారు. ఈ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ హాజరవుతారని ఇందూరు అయ్యప్ప మందిరం ప్రతినిధులు తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాదన కార్యక్రమం ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

బోధన్ రూరల్/కోటగిరి, ఫిబ్రవరి 25: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ బోధన్ డివిజన్ ఇంచార్జి అంజలి కోరారు. బోధన్ పట్టణంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 28వ తేది నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్ జరుగకుండా సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివాజీ, రోహిత్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మార్చి 2న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
లక్ష్మీకళ సినీప్లెక్స్ ఎ/సి - మూసాపేట్

మార్చి 1న బ్రహ్మాండమైన విడుదల



CONTACT 8121942615

A NEW ERA BLOCKBUSTER నేడే చూడండి




సప్తగిరి 70 ఎంఎం- ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00

SUPER HIT నేడే చూడండి



లక్ష్మీకళ - మూసాపేట్ 11.30am
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 4.40pm



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.30,6.00,9.30
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

SRI VIJAYA FILMS

మార్చి 1న బ్రహ్మాండమైన విడుదల



ONE MEDIA 7799090708

మార్చి 1న బ్రహ్మాండమైన విడుదల



NTR CINEMAS 9030161717

విజయవంతమైన 3వ వారం



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00

GLOBAL CINEMAS LLP



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15





● భీమ్‌గల్ మండలం కుప్కల్ గ్రామంలో వర్షాలకు కూలిపోయిన గదులు, కొట్టుకపోయిన వైకుంఠధామం(ఫైల్)

రెండేళ్లకే కూలిన వైకుంఠధామం

● గ్రామాల్లో అస్తవ్యస్తంగా నిర్మించిన వైకుంఠ ధామాలు ● ప్రణాళిక లేని నిర్మాణాలు.. కూలుతున్న గదులు ● లక్షల రూపాయలతో నిర్మించినా.. ఫలితం, ప్రయోజనం శూన్యం

భీమ్‌గల్ రూరల్, ఫిబ్రవరి 25: గత ప్రభుత్వం లక్షల రూపాయల నిధులు వెచ్చించి గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు వినియోగించకుండానే కూలిపోతున్నాయి. నాసిరకం నిర్మాణాలు, యోగ్యత లేని స్థలాల్లో నిర్మాణాలతో చెత్త డంపింగ్ యార్డ్‌లను తలపిస్తున్నాయి. భీమ్‌గల్ మండలంలోని కుప్కల్ గ్రామంలో రెండేళ్ల క్రితం గ్రామ శివారులోని చిన్నపాటి ఒర్రె కాల్వను ఆనుకొని నిర్మించారు. నిర్మాణం చేసే ముందు సరైన స్థలంలో నిర్మించకపోవడంతో.. ప్రస్తుతం ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలం కురుస్తున్న భారీ వర్షాలకు ఒర్రె ఉప్పొంగి ప్రవహించడంతో నీటి ఉధృతికి వైకుంఠధామం కోసం నిర్మించిన గదులు కొట్టుకుపోయాయి. లక్షల రూపాయల నిధులతో నిర్మించిన వైకుంఠధామాలు పనికి రాకుండా పోతున్నాయి. వైకుంఠధామాలకు వచ్చే వారు అంత్యక్రియల అనంతరం స్నానాలు చేసి బట్టలు మార్చుకోవడానికి గదులు లేక పోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలిన వైకుంఠధామం గదులను పునర్ నిర్మించాలని కుప్కల్ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

● ఇదే కుప్కల్ గ్రామంలోని వైకుంఠధామం





ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూజారులు

కొలిప్యాక్‌లో లక్ష్మీనర్సింహస్వామి నాగవెల్లి, చక్రతీర్థం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 25: మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో ఆనందగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో బాగంగా ఆదివారం స్వామివారి నాగవెల్లిని పూజారులు అంగరంగా వైభవంగా నిర్వహించారు. శనివారం స్వామివారి రథోత్సవం, జాతర జరిగింది. ఆదివారం స్వామివారి నాగవెల్లి పూజలు నిర్వహించగా భక్తులు, గ్రామస్థులు తిలకించారు. కాగా, సోమవారం స్వామివారి డోలసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దీంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని వేద పండితులు దండల మోహన్‌శర్మ తెలిపారు.

అర్గుల్‌లో లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ జాతర ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 25: మండలంలోని అర్గుల్ గ్రామంలో ఆదివారం శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం స్వామివారికి అభిషేకం, దీపరాధన, తీర్థ ప్రసాదం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం యాజ్ఞం, అగ్ని ప్రతిష్ఠపన, బలిహరణం, తీర్థప్రసాదవితరణ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. 27న స్వామివారి కల్యాణోత్సవం, 28న సామూహిక కుంకుమార్చన, దొంగల దోపు కార్యక్రమం జరగనుంది. 29న జాతర, రథోత్సవం, మార్చి 1న చక్రతీర్థం, 2న స్వామివారి నాగవెల్లి, చక్రస్నానం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు, గ్రామస్థులు మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు ఆచార్యతేజ చక్రవర్తుల ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలు నిర్వహించానున్నారు. శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం జాతర, రథోత్సవం సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థి క్రాంతి

జాతీయస్థాయి అబాకస్ పోటీలకు దొన్కల్ విద్యార్థి ఎంపిక

మోర్తాడ్, ఫిబ్రవరి 25: మండలంలోని దొన్కల్ గ్రామానికి చెందిన ఎస్.క్రాంతి అనే విద్యార్థి జాతీయస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ సీనియర్ లెవల్ పోటీలో విజయం సాధించి జాతీయస్థాయి అబాకస్‌కు ఎంపికయ్యాడు. కాగా, పాఠశాల కరస్పాండెంట్ టి.నగేష్, కో ఆర్డినేటర్ లత, అధ్యాపకులు జె.లావణ్యలు విద్యార్థి క్రాంతిని అభినందించారు.

రాష్ట్రస్థాయి కేశాట్ లెవల్ టు పరీక్ష

పెర్కిట్, ఫిబ్రవరి 25: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నలంద పాఠశాలలో ఈ అభ్యాస్ అకాడమి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఆదివారం కలం సైటిఫిక్ అటిట్యూట్ టెస్ట్ (కేశాట్ లెవల్ టు పరీక్ష)ను నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి 3నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 300 మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి వీలుగా నలంద హైస్కూల్ యాజమాన్యం ఏర్పాట్లు చేశామని తెలిపారు. విద్యార్థులకు ఐఐటీ, కంపిటిటివ్ పరీక్షలకు ఎంతో తోడ్పాటును అందించే ఉద్దేశంతో గత నాలుగేళ్లుగా నలంద పాఠశాలలో ఐఐటీ, ఒలింపియాడ్ సబ్జెక్టులను బోధిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నలంద పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్, ఉపాధ్యాయులు అక్షయ్, హన్మాండ్లు, ప్రవీన్, సందీప్, మౌనిక, వాసవి, అలిన, తదితరులు పాల్గొన్నారు.



కేశాట్ పరీక్షలు రాస్తున్న పాఠశాల విద్యార్థులు

ముప్కాల్‌లో ఆత్మీయ సమ్మేళనం

ముప్కాల్, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీసమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 1986-87 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 38 ఏళ్ల తర్వాత అందరు ఒకేచోట కలువడం ఆనందంగా ఉందన్నారు. తరగతి గదుల్లో తిరుగుతూ ఆనాటి రోజులు గుర్తు చేసుకుంటూ.. జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చాలా రోజుల తర్వాత కలిసిన సందర్భంగా ఒకరినొకరు యోగా క్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్కు భూమేశ్వర్, రాజారెడ్డి, లక్ష్మణ్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న 1986-87 బ్యాచ్ విద్యార్థులు

కార్యకర్తలను కాపాడుకుంటాం

● మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

మోస్రా, ఫిబ్రవరి 25: కార్యకర్తలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటామని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మోస్రా మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రెడ్డి సంఘం కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏ గ్రామానికి, వర్గానికి తక్కువ చేయలేదని, అడిగిన వారందరికీ కమ్యూనిటీ హాల్స్ మంజూరు చేశామన్నారు. రూ. 150 కోట్లతో నియోజకవర్గంలోని అన్ని కులాలు, వర్గాల వారికి 4వేల కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. పేదలు తక్కువ ఖర్చుతో ఫంక్షన్లు చేసుకోవడానికి నియోజకవర్గంలో 120 కల్యాణ మండపాలు నిర్మించామని, ప్రజల కోరిక మేరకు మోస్రాను నూతన మండలంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రూ.7.50 కోట్లతో మోస్రా మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో నాలుగు వరసలుగా విస్తరించామన్నారు. గత పదేళ్లలో నియోజకవర్గంలోని అన్ని రంగాలకు పుష్కలంగా నిధులు తెచ్చి అభివృద్ధి చేశామని తెలిపారు. పదవులు వస్తాయి, పోతాయి అధికారం వస్తుంది పోతుంది కాని చేసిన మంచితనం ఎప్పటికీ మిగులుతుందన్నారు. కొంత మంది స్వార్థ నాయకులు ఇతర పార్టీల వైపు పోతున్నారు పోయే వాళ్ళు పోతారు నాకేం బాధ లేదన్నారు. అధికార పార్టీ నాయకుల ప్రోద్భలంతో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఎవరైనా మా నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది కలిగించినా ఊరుకోమని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో మనకు మంచి రోజులు వస్తాయని ఆయన అన్నారు. అనంతరం సంఘ సభ్యులు ఆయనను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ ఉమాశ్రీరాములు, మాజీ సర్పంచ్‌లు నరేందర్ రెడ్డి, భూమయ్య, లింగయ్య, రెడ్డి సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మాజీ స్పీకర్ పోచారం



మోస్రాలో కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తూ..

● మండల కార్యాలయం నిర్మాణ పనుల పరిశీలన

మోస్రా: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాన్ని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పదవులు వస్తాయి, పోతాయి చేసిన పనులే గుర్తుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సహకర సంఘం అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ గుత్ప భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ ఉమా శ్రీరాములు, వైస్ ఎంపీపీ కతే శంకర్, మాజీ తాజా సర్పంచ్ నరేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రైల్వేస్టేషన్ రోడ్డు నిర్మాణం!

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 25: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ రైల్వేస్టేషన్‌కు వెళ్ళే రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మత్తులు చేపట్టారు. గత ఏడాది జులైలో కురిసిన భారీ వర్షాలకు రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు తెగిపోవడంతో గత ఎన్నో ఏళ్లుగా ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎంపీ అర్వింద్ చొరవ చూపి రోడ్డు నిర్మాణానికి కృషి చేశారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా కోతకు గురై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో ప్రయాణికులు గత ఏడెనిమిది నెలలుగా అవస్థలకు గురయ్యారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ చొరవ మేరకు సంబంధిత అధికారులు తాత్కాలిక మొరం రోడ్డు వేసి రైల్వేస్టేషన్‌కు రహదారిని పునరుద్ధరించారు. ఈ స్థలంలో శాశ్వత వంతెన నిర్మించి సీసీరోడ్డు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డుపై మొరం వేసిన దృశ్యం



గతంలో వర్షానికి కోతకు గురైన రోడ్డు (ఫైల్)

'మత్స్యకారులకు ప్రాణరక్షణ కల్పించాలి'

ముప్కాల్, ఫిబ్రవరి 25: చేపల వేటకు వెళ్ళి మత్స్యకారులకు ప్రాణాలు రక్షణ కల్పించాలంటూ బాల్కొండ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బట్టు ప్రవీన్ అన్నారు. ఆదివారం బాల్కొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మండలంలోని మత్స్యకారులు శ్రీరాంసాగర్‌ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి లయన్ జాకెట్లు, బోట్లు, మత్స వేటకు అవసరమయ్యే వాటిని ప్రభుత్వం అందించాలని తెలిపారు. రిజర్వాయర్ నుంచి చేపలు వరద కాలువ ద్వారా కొట్టుకుపోతున్నాయని. వరదకాలువ జాలి బిగించి చేపలు పోకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఇందులో మండల అధ్యక్షుడు బట్టు ప్రవీన్, సెక్రెటరీ ఉట్నూర్ గణేష్, బట్టు మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

పెర్కిట్, ఫిబ్రవరి 25: రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ వారి సహకారంతో ఆదివారం ఆర్మూర్ రోటరీ క్లబ్ ప్రతినిధులు విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు గోపి మాట్లాడుతూ దుర ప్రాంతాల నుంచి పాఠశాలకు వెళ్లే విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఏర్గట్ల, ఫిబ్రవరి 25: మండల కేంద్రానికి చెందిన దండవోయిన సతీష్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానిక ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మృతుడు శనివారం రాత్రి 8 గంటల సమయంలో సతీష్ ఏర్గట్ల గ్రామ శివారులోని అయ్యప్ప ఆలయం సమీపంలోని బీటి రోడ్డుపై తన స్నేహితులతో నడుచుకుంటూ వెళుతుండగా అదే గ్రామానికి చెందిన గుర్రపు అజయ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై అతివేగంగా నడపడంతో అక్కడ నడుస్తున్న సతీష్‌ను ఢీకొనడంతో వెంటనే జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించినప్పటికి సతీష్ మృతి చెందాడని, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

పొలం గుంటలో పడి వ్యక్తి మృతి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 25: బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన బాలయ్య (58) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు ఆదివారం పొలం గుంటలో పడి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ నాగ్‌నాథ్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు.



మాట్లాడుతున్న ఎంపీటీసీ కొట్టం మనోహర్

'గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అవినీతి, అక్రమాలు'

కోటగిరి, ఫిబ్రవరి 25: కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకులు గత ప్రభుత్వ హయాంలో ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడి నిరుద్యోగుల జీవనోపాధిని కొల్లగొట్టారని ఎంపీటీసీ కొట్టం మనోహర్ ఆరోపించారు. మండల బీఆర్ఎస్ నాయకులు తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం కోటగిరిలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మనోహర్ మాట్లాడుతూ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్ఎస్ఎఫ్ భూముల్లో 28 ఎకరాలు అక్రమంగా లబ్ధి పొందారని ఆరోపించారు. అంతేకాకుండా మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన తమ బంధువులకు కోటగిరి మండలంలో స్థిర నివాసం కల్పించి రేషన్ కార్డులు సృష్టించి ప్రభుత్వ సొమ్మును మింగేస్తున్నారని ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలోనూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇది చాలదన్నట్లు మైనారిటీ, గురుకుల, బాలుర పాఠశాల, కళాశాలల్లో తమ బంధువులతో పాటు కుటుంబ సభ్యులకు పలుకుబడిని ఉపయోగించి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను ఇప్పించారని ఆరోపించారు. నిరుద్యోగ యువత అవకాశాలను మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గండి కొట్టారన్నారు. హంగర్గ ఫారంలో బీఆర్ఎస్ నాయకుడు సోదరుడు గ్రామ పంచాయితీలో కారోబార్‌గా పనిచేస్తూ దొంగ సర్టిఫికెట్లతో పెన్షన్ పొందుతున్నాడని ఆరోపించారు. మరో వైపు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల అమలులోనూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అంతేకాకుండా మాజీ ఏఎంసీ చైర్మన్ ప్రభుత్వం యంత్ర లక్ష్మీ కింద ఇచ్చిన ట్రాక్టర్‌ను అప్పటికప్పుడే అమ్ముకున్నారని ఆరోపించారు. మరోవైపు పోచారం తనయులు అధికారం కోల్పోగానే కాంగ్రెస్ నాయకుల చుట్టూ తిరిగితే తప్పు లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు అడుగడుగునా అవినీతికి పాల్పడినా పోచారం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇకనైనా పార్టీ మారిన వారిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సునీల్‌కుమార్, మాజీ ఎంపీపీలు పవన్, శంకర్, గంగాధర్ దేశాయ్, ఎంపీటీసీ విఠల్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ రామిరెడ్డి, హనుమంతు, ధన్‌రాజ్, దత్తు, బర్ల సాయిలు, ఎంఎ హకీం, తదితరులు పాల్గొన్నారు.

'పదేళ్లు సేవ చేస్తే.. శని బిరుదా?!'

కోటగిరి, ఫిబ్రవరి 25: గత పదేళ్లుగా మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి నమ్మిన బంటుగా పనిచేస్తే ఆయనతో పాటు ఆయన అనుచరులు తనకు శని బిరుదు ఇవ్వడంపై మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి పదేళ్ల పాటు ఎంతో సేవ చేశానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. మండలంలో ఏ కార్యక్రమం తలపెట్టిన తానే భరించి కార్యక్రమాలను విజయవంతం చేశానన్నారు. తాను ఖర్చు పెట్టిన డబ్బులు పోచారంతో సహా ఆయన కుటుంబ సభ్యులు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీలో వైస్ ఎంపీపీతో పాటు ఎంపీపీ పదవిని పొందినందుకు నమ్మి సేవ చేశానన్నారు. తాను పార్టీ వదిలి కాంగ్రెస్‌లోకి వెళితే శని పోయిందంటూ సంబరాలు చేయడం సిగ్గుచేటన్నారు. మండల బీఆర్ఎస్ నాయకులు కొందరు హైకమాండ్ ఆదేశాలతో చిల్లర మాటలు మాట్లాడి పోచారం మెప్పు పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా బాన్సువాడ నియోజకవర్గంలో 40 ఏళ్ల పాటు పోచారానికి నమ్మి సేవ చేసిన కుటుంబాలు నాశనం అయ్యాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా పోచారంతో సహా బీఆర్ఎస్ నాయకులు విలువలతో కూడిన రాజకీయం చేయాలని సూచించారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ భూస్థాపితం కావడం ఖాయమ ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొట్టం మనోహర్, మాజీ ఎంపీపీలు గంగాధర్‌రావు దేశాయ్, హెగ్డోలి శంకర్, పవన్, కొత్తపల్లి విండో అధ్యక్షుడు సునీల్‌కుమార్, ఎంపీటీసీ విఠల్, వీరేశం, భీమసాయిరెడ్డి, వహీద్, రాజు, అరుణ్‌కుమార్, దత్తు, పాషా, తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఫోన్ వస్తేనే జంకుతున్న మహిళలు

- భిక్కనూరులో మహిళలే టార్గెట్‌గా ఫోన్‌కాల్స్, మెసేజ్ చేస్తున్న ఆకతాయిలు
- అసభ్యకరంగా మాట్లాడుతూ వేధిస్తున్నారని కొందరు మహిళలు పోలీసులకు ఫిర్యాదులు
- బయటకు చెప్పుకోలేక కుమిలిపోతున్న మరి కొందరు

భిక్కనూరు, ఫిబ్రవరి 25: హలో బాగున్నావా ఏం చేస్తున్నావ్ అంటూ మొదలు పెట్టి అసభ్యకరమైన మెసేజ్‌లు, ఫోన్‌లు చేస్తూ మహిళలను వేధిస్తున్న సంఘటనలు భిక్కనూరులో ఇటీవల వరుసగా చోటు చేసుకుంటున్నాయి. బాధిత మహిళల కథనం ప్రకారం.. భిక్కనూరు పట్టణంలో కొందరు మహిళలకు వేర్వేరు సమయాల్లో అన్ నవున్ నెంబర్ నుంచి గత కొన్ని రోజుల క్రితం ఫోన్ వచ్చింది. ఫోన్ లిఫ్ట్ చేసి మాట్లాడిన ప్రతీ మహిళకు ఎంతగానో తెలిసిన వారివలే బాగున్నావా ఏం చేస్తున్నావ్ అంటు అవతలివారు సాధక బాధకాలు తెలుసుకుంటూ అసలు మీరు ఎవరు అంటు బాధిత మహిళలు ఎన్నిసార్లు అడిగినా సమాధానం దాట వేస్తూ మహిళలను మాటల్లో పెట్టి వారితో అసభ్యకరంగా మాట్లాడటం చేస్తున్నారు. ఎన్నిసార్లు రాంగ్ నెంబర్, మీరు ఎవరికో చేయబోయి తనకు చేశారని చెప్పినా, ఫోన్‌ను కట్ చేసినా లేదు నేను నీకోసమే చేస్తున్న అంటు ఎన్నిసార్లు కట్ చేస్తే అన్నిసార్లు ఫోన్ చేస్తూ, మెసేజ్‌లు పెడుతూ అసభ్యంగా ప్రవర్తిస్తూ మహిళలను భయాందోళనకు గురి చేస్తున్నారు. భిక్కనూరు పట్టణంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో సైతం పలువురు మహిళలకు ఆకాతాయిలు నరకం చూపిస్తున్నారు.

ఫోన్ నెంబర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టినా కొత్త నెంబర్లతో వేధింపులు

ఆకతాయిల బాధ భరించలేక సదరు మహిళలు ఎన్నిసార్లు ఆ ఫోన్ నెంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టినా కొత్తకొత్త నెంబర్లతో ఫోన్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మీరు నాకు తెలుసు అంటూ నీచాతి నీచంగా మాట్లాడుతూ, మెసేజ్‌లు పెడుతూ టార్చర్ పెడుతున్నారని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ మాట్లాడాలంటే భయపడే పరిస్థితి ఉందని, బయటకు చెప్పుకోలేక, లోలోపల బాధపడుతూ తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని రోదిస్తున్నారు. ఇంతకీ ఎందుకు ఫోన్‌లు, మేసేజ్‌లు చేస్తున్నారో ఎంతకీ అర్థం కావడం లేదని, మా ఫోన్ నెంబర్లు వారికి ఎలా తెలిశాయి, ఎవరు ఇచ్చారు అన్న ప్రశ్నలు తలెత్తున్నాయని సదరు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెంబర్లపై స్థానిక పోలీసుస్టేషన్‌లో పలువురు మహిళలు ధైర్యం చేసి వారి కుటుంబ సభ్యులతో సహా వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు.

ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌ల అకౌంట్‌ల తొలగింపు

భిక్కనూరు పట్టణంతో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో మహిళలను వేధిస్తున్నారని ఇంటర్నెట్ మాధ్యమాల్లో హల్‌చల్ కావడంతో మండలంలోని చాలా మంది మహిళలు, మరీ ముఖ్యంగా యువతులతో పాటుగా పురుషులు సైతం ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌ల అకౌంట్లను తొలగిస్తున్నారు. మరికొంత మంది వాటిల్లో ఉన్న కుటుంబ సభ్యుల ఫొటోలు, వీడియోలను తొలగిస్తున్నారు. అసలు ఫోన్ ముట్టాలంటే జంకుతున్న పరిస్థితి ఉంది.

మహిళలను వేధిస్తున్న వారిని వెంటనే పట్టుకుంటాం

- సాయి కుమార్, ఎస్సై, భిక్కనూరు

భిక్కనూరులో ఇటీవల కొందరు మహిళలకు ఆకాతాయిలు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతూ, మెసేజ్‌లు చేస్తూ వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. కొంత మంది మహిళలు తమకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. ఫోన్ నెంబర్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లాకు సంబంధించినవి గుర్తించడం జరిగింది, అక్కడి నుంచే మహిళలకు ఫోన్‌లు వస్తున్నట్లు గుర్తించాం. వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్‌లలో వచ్చిన అనవసరమైన లింకులను ఎవరూ ఓపెన్ చేయవద్దని, గుర్తు తెలియని నెంబర్ల నుంచి ఫోన్‌లు వస్తే లిఫ్ట్ చేయక పోవడమే మంచిది. కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలను సైతం అందులో పోస్టు చేస్తూ ఇలా ఇబ్బందులకు గురికావద్దు. ఇలాంటి నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజల్లో అవగాహన కల్పిస్తూనే ఉన్నాం. మహిళలను ఫోన్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని త్వరలోనే పట్టుకుంటాం.

మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు పట్ల హర్షం

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 25: 317 జీవో అమలు జరిపిన సందర్భంలో ఏర్పడిన సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారాలను సిఫారసు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయడం హర్షనీయమని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ తెలిపారు. రాష్ట్రపతి ఉత్తర్వుల 2018 అమలులో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల శాశ్వత కేటాయింపుల కోసం గత ప్రభుత్వం జరిపిన 317 జీవో అమలు కారణంగా పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. క్యాడర్‌లో జూనియర్ అయినందుకే సొంత జిల్లాలను వదిలి స్థానికేతర జిల్లాకు కేటాయించబడ్డారని తెలిపారు. గత 2 సంవత్సరాలుగా 317 జీవో అమలు ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీయూటీఎఫ్ పక్షాన కోరుతున్నామన్నారు.

పూర్వీకులు మనకు ఇచ్చిన సంపద యోగా

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 25: పూర్వీకులు మనకు ఇచ్చిన వెలకట్టలేని సంపద యోగా అని యోగా గురువులు అన్నారు. ఆదివారం ఎస్ఎస్‌వై యోగ సెంటర్‌లో 15వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక యుగంలో కూడా విచిత్రమైనటువంటి రోగాలను కూడా నయం చేసేటటువంటి శక్తియోగకు మాత్రం ఉందని యోగాను దిన చర్యలో భాగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యోగ గురువులు అంజయ్య గుప్తా, రఘుకుమార్, అంజయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మెమోంటో అందుకుంటున్న సాయి సంస్కృతి

అబాకస్ పోటీల్లో మద్నూర్ విద్యార్థినికి ప్రథమ స్థానం

మద్నూర్, ఫిబ్రవరి 25: జిల్లాలోని మారుమూల మండల కేంద్రానికి చెందిన కె.సాయి సంస్కృతి రాష్ట్రస్థాయి అబాకస్ పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. చెన్నైలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థినీ మండల కేంద్రంలోని న్యూ ఆదర్శ పాఠశాలలో చదువుతుంది.

అబాకస్ పోటీలకు రిఖిల్‌గౌడ్

మాచారెడ్డి: మండలంలోని ఫరీద్‌పేట్‌కు చెందిన కర్రోళ్ల రిఖిల్‌గౌడ్ అనే విద్యార్థి జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు ఎంపిక య్యాడు. హైదరాబాద్‌లో విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ లాబ్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు విశ్వం ఎడ్యుటెక్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 25: కామారెడ్డి మండలంలోని గర్గుల్‌లో సోమవారం నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి నియోజకవర్గ ప్రజలను కోరారు. శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తేలు శ్రీనివాస్ కోరారు. సోమవారం పీపుల్స్ ఫర్ ఇండియా భవన సముదాయంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. అవసరం ఉన్న వారికి ఉచిత అద్దాలు, శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు.

ఖేల్ ఇండియా పోటీలకు ఎంపికైన పీఈటీలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 25: కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు చెందిన ఇద్దరు పీఈటీలు మహేంద్రచారి, నవీన్‌కుమార్‌లు ఖేల్ ఇండియా యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక అధికారులుగా ఎంపికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి తెలిపారు. ఈనెల 28 వరకు అసోం రాష్ట్రంలోని గువాహటి పట్టణంలో జరుగుతున్న పోటీల్లో వీరు పని చేయనున్నట్లు తెలిపారు.


రోహిదాస్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న మోచి కులస్తులు

మద్నూర్‌లో రోహిదాస్ మహరాజ్ జయంతి

మద్నూర్, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని మోచి కాలనీలో ఆదివారం సద్గురు రోహిదాస్ మహరాజ్ 647 జయంతి సందర్భంగా ఉత్సవాలను జరుపుకున్నారు. ప్రతీ సంవత్సరం ఆయన జయంతిని మండల కేంద్రంలో భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రోహిదాస్ మహరాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఉత్సవాలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంజీవ్, దిలీప్, మోచి కులస్తులు తదితరులున్నారు.

ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య

రాజంపేట, ఫిబ్రవరి 25: మండలంలోని ఆరేపల్లి తండా గ్రామానికి చెందిన లంబడి పీర్యా(45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సంపత్ తెలిపారు. అనారోగ్య సమస్యలతో పాటు అప్పుల బాధతో ఇబ్బందులు పడుతున్నాడని తెలిపారు. శనివారం ఇంట్లో నుంచి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

భూ తగాదాలతో తండ్రిపై కొడుకు దాడి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 25: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గండి మాసానిపేట్ ప్రాంతానికి చెందిన బండారి సాయిరాంగౌడ్ అనే వ్యక్తి ఆయన భూమిని సర్వే చేస్తుండగా ఆయన కొడుకు అయిన వివేకానందా గౌడ్ వచ్చి భూమి ఎందుకు సర్వే చేస్తున్నారని బూతు మాటలు తిడుతూ తండ్రిపై దాడి చేయడానికి ప్రయత్నించడంతో బాధితుడు బండారి సాయిరాంగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపారు.

ఘనంగా జిల్లా పరిషత్ పాఠశాల వార్షికోత్సవం

సదాశివనగర్, ఫిబ్రవరి 25: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థి దశ గొప్పదని, విద్యార్థులు జీవితంలో రాణించేందుకు కష్టపడి ముందుకు అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన, జ్యోతి, జ్యోతికిరణ్, శశిరేఖ, అనురాధ, వెంకటేశం, ఇంద్ర, శేఖర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు వెళ్లి వచ్చిన ముత్యంపేట గ్రామస్థులు

దోమకొండ, ఫిబ్రవరి 25: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన గ్రామస్థులు అయోధ్య బాలరాముడిని, కాశీ విశ్వేశ్వరుని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సహకారాలతో అయోధ్యకు చేరుకున్నట్లు తెలిపారు.


బాన్సువాడలో ఏనుగు రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం


బీర్కూర్‌లో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రవీందర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయా పార్టీల నాయకులు

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 25: బాన్సువాడ కాంగ్రెస్ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో ఆదివారం ఆయా గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఏనుగు రవీందర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బోర్లం ఎంపీటీసీ శ్రావణి దేవేందర్‌రెడ్డి, బోర్లం క్యాంపు ఉప సర్పంచ్ కొండ సాయిలు, అర్షద్‌ఖాన్, నాయకులు తదితరులున్నారు.

బీర్కూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా ఆదివారం బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామానికి చెందిన 120 మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయిని శంకర్, మండల ఉపాధ్యక్షుడు గొండ్ల శ్రీను, చందు, యామ రాములు, గంగొండ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ

- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, విండో చైర్మన్
- క్యూలో మరికొంత మంది నాయకులు


కాంగ్రెస్‌లో చేరుతున్న భిక్కనూరు బీఆర్ఎస్ నాయకులు

భిక్కనూరు, ఫిబ్రవరి 25: గత అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచి కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నుంచి చాలానే చేరికలు ఉంటాయని ఊహాగానాలు వచ్చిన వాటిని బీఆర్ఎస్ నాయకులు కొట్టిపాడేస్తూనే ఉన్నారు. కానీ అందరి నమ్మకాలను తలకిందులు చేస్తూ బీఆర్ఎస్‌కు మండలంలోని పెద్దలీడర్లు పెద్దషాక్ ఇచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, భిక్కనూరు విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, తాజా మాజీ సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాద్దుల నర్సింలు యాదవ్, మాజీ జడ్పీటీసీ నంద రమేష్, మాజీ ఎంపీటీసీ విండో డైరెక్టర్ బాల్ నర్సవ్వ ఆదివారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి షబ్బీర్‌అలీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రానున్న ఎంపీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ మెజార్టీ సీట్లను గెలుచుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రతీ గ్రామంలో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు సైనికుడి వలె పని చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు, పనితీరును నచ్చి పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నారని, రానున్న కొన్ని రోజుల్లోనే బీఆర్ఎస్ తట్టాబుట్ట సర్దుకొనిపోతుందన్నారు. ఈ మేరకు షబ్బీర్‌అలీని నర్సింహారెడ్డి, భూమయ్య, నర్సింలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుపరి భీంరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎన్ఆర్ఐ సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్ రెడ్డి, బల్యాల సుదర్శన్, లింబాద్రి, దయాకర్‌రెడ్డి, అంకం రాజు, రామస్వామి, మహిపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బస్వన్నపల్లిలో నీటి గోస

- చందాలు వేసుకుని ప్రైవేట్ ట్యాంకర్లలో నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు
- సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో తప్పని తిప్పలు
- స్పెషల్ ఆఫీసర్లు ఉన్నా పట్టింపు కరువు


బస్వన్నపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

రాజంపేట, ఫిబ్రవరి 25: మండలంలోని బస్వన్నపల్లి గ్రామస్థులు నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి నీరు అందకపోవడం, గ్రామ పంచాయతీ కార్యాలయంలో తమ ఆవేదన చెప్పుకోవడానికి అధికారులు ఎవరూ లేకపోవడంతో నానా తంటాలు పడుతున్నారు. చందాలు వేసుకుని మరీ ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకోవాల్సి వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ పథకం చేపట్టిన పూర్తిస్థాయిలో తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. ట్యాంకులు ఉన్నా కొన్నింటికి నీళ్లు పై వరకు చేరడం లేదు. కొన్నిచోట్ల నీటి ట్యాంకులు ఉన్నా వాటిని సరిగా శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు సరఫరా అవుతుందని ఆవేదన చెందుతున్నారు. ప్రతీ పది రోజులకు ఒకసారి శుభ్రం చేయాల్సి ఉండగా చాలా చోట్ల అసలు శుభ్రం చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీల్లో ఆస్తిపన్ను, నల్లా పన్నులు ముందుగానే కట్టించుకుంటున్నా నీటి సమస్యలను మాత్రం తీర్చడం లేదు. సర్పంచ్‌ల కాలం సైతం ఇటీవల ముగియడంతో అసలు ఎవరికి తమ గోస చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితుల్లో ప్రజలు ఉంటున్నారు. ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్లు ఉన్న గ్రామంలో సమస్యలను పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పంచాయతీ కార్యదర్శి సైతం సెలవుల్లో ఉండడంతో ట్యాంకర్ల ద్వారా రూ.200లు పెట్టి నీటిని తెచ్చుకుంటున్నామని అంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చొరవ తీసుకుని గ్రామంలో నీటి సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు.

మాజీ జడ్పీటీసీని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు

- బాన్సువాడ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీకి వినతి

బీర్కూర్, ఫిబ్రవరి 25: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రధాన అనుచరుడు బీర్కూర్ మండల మాజీ జడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారంటూ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీర్కూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో ఆదివారం బాన్సువాడకు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీలో మాజీ జడ్పీటీసీ సతీష్‌ను చేర్చుకోవద్దంటూ నాయకులు బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డికి విన్నవించారు. ఈ మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి స్పందిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ సతీష్‌ను పార్టీలోకి చేర్చుకోమని హామీ ఇచ్చారు. గత పదేళ్లుగా అధికార బలంతో కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను టార్గెట్ చేసి హింసించాడని కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి ముందు వాపోయారు. అలాంటి వారిని పార్టీలోకి తీసుకుంటే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. భైరాపూర్‌లో తన అనుచరులను ఉసిగొలిపి అసభ్య పదజాలంతో రవీందర్‌రెడ్డిని తిట్టించిన వీడియోలను చూపించడంతో పాటు, వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేయించిన విషయాలను నాయకులు ఇన్‌చార్జికి గుర్తు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో సతీష్‌ను పార్టీలోకి తీసుకోబోమని రవీందర్‌రెడ్డి హామీని ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

గర్భిణీకి రక్త దానం

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 25 : బాన్సువాడ ఎంసీహెచ్ ఆస్పత్రిలో ఓ గర్భిణీకి అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువకుడు రక్తం యూనిట్‌ను బ్లడ్ బ్యాంకు సిబ్బందికి అందజేశాడు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ రక్తం దానం చేసి ప్రాణదాతలుగా నిలవండని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రాఘవేందర్, ఫౌండేషన్ సభ్యులు సాయికుమార్, సాయిలు, అశోక్ తదితరులున్నారు.

1న సంతోషి మాతా ఆలయ వార్షికోత్సవం

మద్నూర్, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని సంతోషి మాతా ఆలయంలో శుక్రవారం మార్చి 1న ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు సంతోషి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ధ్వజారోహణం, కుంకుమార్చన, అభిషేకం, యజ్ఞం, హారతి కార్యక్రమాలుంటాయని తెలిపారు.

కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 25: మండలంలోని మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహ పంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 25: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఎమ్మెల్యే మదన్‌మోహన్ దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ. 5లక్షలు మంజూరు చేశారని కాంగ్రెస్ నాయకుడు గౌలపల్లి మల్లేష్ అన్నారు. ఆదివారం పంచాయతీ రాజ్ ఏఈ కృష్ణతో కలిసి ప్రారంభించారు. అదే విధంగా మండలంలోని మత్తమాల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎల్లారెడ్డి జడ్పీటీసీ ఉషాగౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమట్టెల అందజేత

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 25: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో ఓ పేదింటి ఆడపిల్ల పెళ్లికి స్థానిక కౌన్సిలర్ తేజాపు మానస ప్రసాద్‌లు పుస్తెమట్టెలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లను అత్తగారింటికి పంపేందుకు తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పెళ్లిలు చేస్తున్నారని అన్నారు. ప్రజాప్రతినిధులుగా తమకు అవకాశం కల్పించే సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రజలకు తోడుగా నిలిచేందుకు తమ వంతు సాయంగా పుస్తెమట్టెలు అందిస్తున్నామని తెలిపారు.


బదిలీపై వెళ్తున్న సిస్టర్లకు జ్ఞాపికను అందజేస్తున్న వైద్యులు

ప్రజలకు సేవలందిచడం అదృష్టంగా భావించాలి

దోమకొండ, ఫిబ్రవరి 25: ప్రజలకు సేవలందిచడం అదృష్టంగా భావించాలని సీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో గత 13 సంవత్సరాలుగా సిస్టర్స్‌గా విధులు నిర్వహించిన కేరొళిన్ ఖైరతాబాద్ ఆసుపత్రికి, సుమతి నల్గొండ జిల్లా చౌటుప్పల్ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. ఆదివారం వారికి దోమకొండలోని సీహెచ్‌సీలో వైద్యాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దోమకొండ సీహెచ్‌సీ నుంచి జ్ఞాపికను అందజేశారు. నూతనంగా దోమకొండ ఆసుపత్రికి సుష్మ కామారెడ్డి, సంధ్య నర్సాపూర్ నుంచి వచ్చారు. కార్యక్రమంలో వైద్యులు పద్మావతి, శ్రీవాణి, దివ్య, హైందవి, మీనా, ప్రమీల, నర్సులు యశోద, సుష్మ, స్రవంతి, సిబ్బంది స్వరూప, వినయ్, శ్రీనివాస్, శంకర్, నర్సింలు, మధుసూదన్, తిలోత్తమ, మల్లిఖర్జున్, తదితరులు పాల్గొన్నారు.

రేణుకాదేవి 60వ ఆలయ వార్షికోత్సవం

దోమకొండ, ఫిబ్రవరి 25: మండలంలోని ముత్యంపేట గ్రామంలో రేణుకాదేవి 60వ వార్షికోత్సవం సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్తగారి శిరీష్‌గౌడ్ తెలిపారు. 26న సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీ విఘ్నేశ్వర పూజ, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి శోభయాత్ర (శావ), 27న మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి బోనాల ఊరేగింపు, 28న బుధవారం చక్కెర తీర్థం(జాతర) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాన్నారు.మూడు రోజుల పాటు రాత్రి 8 గంటల నుంచి శ్రీ సింగరాయపల్లి అంజయ్య శిష్యుల బృందంచే శ్రీ రేణుకా ఎల్లమ్మ ఒగ్గుకథ ఉంటయాని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిన్నపోశగౌడ్, ఎ. స్వామిగౌడ్, యం. మోహన్‌గౌడ్, యం. సిద్దాగౌడ్, యం. గోపాల్‌గౌడ్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్	హనుమాన్
శాంతి	ఊరు పేరు భైరవకొన
ప్రియా 70	ఈగల్
ప్రియా 35	సిద్దార్థరాయ్

బాన్సువాడ

మహేశ్వరి	ఊరు పేరు భైరవకోన
వెంకటేశ్వర	హనుమాన్



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

